క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు మార్జిన్‌లోకి దిగిన బస్సు

సీతారామపురం: సీతారామపురం–సంగసానిపల్లి మార్గంలో జగనన్న కాలనీల వద్ద గురువారం ఉదయగిరి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. సీతారామపురం నుంచి ఉదయగిరికి బయల్దేరిన ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న ఆటోను జగనన్న కాలనీ వద్ద క్రాస్ చేయబోయి అదుపు తప్పి పక్కకు ఒరిగింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బార్ సీజ్

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీలోని బార్‌ను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. బార్‌లో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించి సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి, సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు తెలిపారు.

వీఏఏ సస్పెన్షన్

సీతారామపురం: మండలంలోని బాలాయపల్లి సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తమ్మిశెట్టి వెంకటపతిని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి సస్పెండ్ చేశా రు. టీడీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తూ ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వెంకటపతి ఉల్లంఘించినట్లు ఈ నెల 16న సీతారామపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు అతనిపై విచారణ జరిపి సస్పెండ్ చేసినట్లు ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి తెలిపారు.

మేకపాటి పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: మండలంలోని జడదేవి ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి మృతి చెందిన రవి కుటుంబ సభ్యులను గురువారం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. రవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని జంగంరెడ్డిపల్లెలో రెండ్రో జుల క్రితం విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన అజిత్‌ను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలి అహ్మద్, నాయకులు ఎం.తిరుపతినాయుడు, ఎం.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మేకపాటి కొడుకు.. కోడలు ప్రచారం



ప్రచారం చేస్తున్న అభిషేక్‌రెడ్డి, శ్రీయారెడ్డి

జలదంకి: మండలంలోని బీకే అగ్రహారంలో గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కుమారుడు అభిషేక్‌రెడ్డి, కోడలు శ్రీయారెడ్డి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంటేరు రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, స్థానిక నాయకులు దేవరపల్లి రఘురామిరెడ్డి, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, షేక్ హజరత్, తదితరులు పాల్గొన్నారు.

మామయ్య గెలుపు కోసం కోడలు ప్రచారం



వృద్ధురాలిని పలకరిస్తున్న నిహారికారెడ్డి

ఉదయగిరి: ఎన్నికల్లో తన మామ మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోడలు మేకపాటి నిహారికారెడ్డి ఓటర్లను కోరారు.ఆమె గురువారం సాయంత్రం పట్టణంలోని షబ్బీర్ కాలనీ, దిలావర్‌బావి వీధి ప్రాంతాల్లో కార్యకర్తలు, నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, గడియాల్చి ఎస్దాని, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ పెదమస్తానీ, నాయకులు ఏ భాస్కరరెడ్డి జి.శ్రీనివాసులరెడ్డి, యు.శ్రీనివాసులు, ఖిల్జీ సలీం, డి.చెన్నయ్య, సుభానీ, పద్మ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.





తీరం...సుసంపన్నం

మత్స్యకారులకు బంగారు భవిష్యత్
- నిన్నటి వరకు కూలీలు.. రేపటి నుంచి యజమానులు
- అనుబంధ పరిశ్రమల ద్వారా మరింత మందికి జీవనోపాధి

జిల్లాలోని తీర ప్రాంత మత్స్యకారులు బతుకుదెరువుకు వలసలు నివారించి, వారికి బంగారు భవిష్యత్ కల్పించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. కావలి నియోజకవర్గంలోని ప్రతి మత్స్యకార కుటుంబాన్ని బోటు యజమానిని చేయాలనేది ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి లక్ష్యం. దశాబ్దాలుగా మత్స్యకారుల స్వప్నం సాకారం చేయడానికి ఆ ఇద్దరు అకుంఠిత దీక్షతో సిద్ధం చేశారు. ఎన్నికల తరుణంలో ఆ ఫలాలు మత్స్యకారులకు అందించడానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆ ఇద్దరు మళ్లీ అధికారంలోకి వస్తేనే మత్స్యకారుల జీవితాలు మారుతాయి. ఓటు మారితే.. జీవితాలు తారుమారు అవుతాయి.

కావలి:జిల్లాలోని సముద్రతీరం సుసంపన్నంగా మారనుంది. నిన్న.. మొన్నటి వరకు ఉపాధి కోసం ఊళ్లు పట్టుకుని వెళ్లిన గంగపుత్రులకు ఇప్పుడు తమ ప్రాంతంలోనే తమతో పాటు మరో పది మంది బయటవాళ్లకు కూడా ఉపాధి కల్పించే అవకాశం లభించింది. ఇతర రాష్ట్రాల్లోని సముద్ర తీరంలోని చేపలు పట్టే బోట్లలో కూలీలుగా వెళ్తున్న మత్స్యకారులు ఇక సొంత ప్రాంతంలోనే దర్జాగా బతకవచ్చు. అపారమైన సాగర సంపద, ఎగుమతులు, దిగుమతులతో మత్స్యకారుల జీవితాల్లో మునుపెన్నడూ చూడ ని వెలుగులు నిండనున్నాయి. ముఖ్యంగా కావలి నియోజకవర్గంలోని ప్రతి మత్స్యకార కుటుంబాన్ని పార్టీలకు అతీతంగా బోటు యజమానిని చేయడానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రణాళికలు రచించారు.

అంతా సిద్ధం.. కోడ్ తర్వాత అంకితం

బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుమారు 72 ఎకరాల్లో రూ.288.80 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మితమైంది. హార్బర్‌తో పాటు మరో 50 ఎకరాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్క్‌తో మత్స్యసంపదకు అదనపు విలువలు జోడించి మరింత ఆదాయం పొందే అవకాశం కూడా ఏర్పడింది. మత్స్యకారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్టుదలతో తొలి దశలోనే జువ్వలదిన్నెకు హార్బర్ మంజూరు కాగా నిర్దేశిత గడువుకన్నా ముందే నిర్మాణం కూడా పూర్తయింది. ప్రారంభోత్సవ సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభం వాయిదా పడింది. ఎన్నికలు పూర్తయిన వెంటనే హార్బర్ మత్స్యకారులకు అందుబాటులోకి రానుంది.

ఏటా అదనంగా 41,000 టన్నుల మత్స్యసంపద

జువ్వలదిన్నెలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ కారణంగా ఒకపై ఏటా 41,000 టన్నుల మత్స్యసంపద అదనంగా లభించనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు తీరంలో పెద్దబోట్లు నిలిపే అవకాశం లేకపోవడంతో సముద్రంలో 25 నాటికల్ మైళ్ల దాటి వేట చేపట్టలేకపోయేవారు. ఇప్పుడు ఏకంగా 1,250 బోట్లు నిలిపే సామర్థ్యంతో ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి రావడంతో పెద్ద బోట్ల సాయంతో వేటసాగించే అవకాశం లభించింది. దీంతో ప్రస్తుతం ఏటా అదనంగా 41 వేల టన్నుల మత్స్యసంపద లభించడంతో పాటు రానున్న 30 ఏళ్లలో హార్బర్ ద్వారా పదిలక్షల టన్నుల మత్స్యసంపద లభించనుందని ఏపీ మారిటైం బోర్డు అంచనా వేస్తుంది.

ప్రతి కుటుంబం యజమానే..

కావలి నియోజకవర్గంలోని ప్రతి మత్స్యకార కుటుంబాన్ని పార్టీలకు అతీతంగా యజమానిని చేయడానికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. సముద్రంలో అపారమైన మత్స్యసంపదను వెలికి తీయాలంటే 25 నాటికల్ మైళ్ల దాటి వేట సాగించాలి. ఇందుకోసం ఖరీదైన పెద్ద బోట్లు అవసరం. స్థానిక మత్స్యకారులకు ఆర్థిక వనరులు అంతంత మాత్రంగా ఉండటంతో ఇప్పటి వరకు సరైన వేట, ఉపాధి అవకాశాలు లేక నియోజకవర్గంలోని మత్స్యకారులు తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ, గుజరాత్, ముంబయి, గోవా వంటి ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేది. స్థానికంగానే మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనుండటంతో వలసలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది. కావలి నియోజకవర్గంలో 65 మత్స్యకార గ్రామాల్లో 15,000 పైగా కుటుంబాలు ఉన్నాయి. హార్బర్‌లో 1,250 బోట్లు నిలిపే సామర్థ్యం ఉండడంతో స్థానిక మత్స్యకారుల పరిస్థితిని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆ బోట్లను స్థానిక మత్స్యకారులకే రాయితీ, రుణపరపతి కల్పించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు మంత్రిత్వశాఖకు ఆదేశాలు జారీ చేయడం, ఆమోదించడం అన్నీ చకచకా జరిగిపోయాయి.

50 శాతం రాయితీ

ఒక్క బోటు ఖరీదు రూ.1.20 కోట్లు. ఒక్కొక్క బోటుకు 10 మంది లబ్ధిదారులు. పది మంది మత్స్యకారులు బృందంగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. 40 శాతం బ్యాంకు నుంచి రుణం అందిస్తోంది. మిగిలిన పది శాతం మత్స్యకారులు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో మత్స్యకారుడు రూ.1.20 లక్షలు చెల్లించి పెద్ద బోటుకు యజమాని కావచ్చు. ఈ లెక్కన ప్రతి మత్స్యకారుడికి రూ.6 లక్షల రాయితీ లభిస్తోంది. ఈ పద్ధతిలో కావలి నియోజకవర్గంలో మొత్తం 1,250 బోట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఈ లెక్కన ఒక్క కావలిలోనే 12,500 మందిని బోటు యజమానులు కానున్నారు. దశల వారీగా ప్రతి కుటుంబాన్ని యజమానిని చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని కావలితో పాటు కోవూరు, సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని మత్స్యకారులకు ఇటువంటి అవకాశం ఉంది.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

విస్తీర్ణం	72 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.288.80
బోట్లు నిలిపే సామర్థ్యం	1,250
ఏటా అదనపు మత్స్య సంపద	41 వేల టన్నులు
ప్రత్యక్ష ఉపాధి	6,100 మంది
పరోక్షంగా ఉపాధి	10 వేల మంది

మా బతుకులు మారుతాయని కలలో కూడా ఊహించలేదు



జువ్వలదిన్నె వద్ద హార్బర్ వస్తుందని, మేం కూడా పెద్ద బోట్లకు యజమానులం అవుతామని కలలో కూడా ఊహించలేదు. పక్కనే సముద్రం ఉన్నా ఉపాధి కోసం మా కుర్రోల్లంతా పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేది. ఇంట్లో ముసల్లోలను, పిల్లలను వదిలి పొట్ట చేతపట్టుకుని పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నుంచి సొంత ఊరిలోనే పెద్దబోట్లతో వేట సాగించే పరిస్థితి కల్పించడం నిజంగా మా అదృష్టం. మేం అంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
– గంగనగారి యాదగిరి, మత్స్యకారుడు, పెదపట్టపుపాళెం, కావలి మండలం

మాఊర్లో హార్బర్ అంటే మొదట్లో నమ్మలేదు



మా ఊర్లో హార్బర్ కడుతారంటే మేం అస్సలు నమ్మలేదు. అధికారులు వచ్చి వెళ్తున్నా, సర్వేలు చేస్తున్నా పనులు ప్రారంభించేంత వరకు మాకు నమ్మకం కలగలేదు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మా మత్స్యకారుల భవిష్యత్ పట్ల బాగా చొరవ చూపించారు. ఇప్పుడు హార్బర్ నిర్మాణం పూర్తయింది. త్వరలోనే సబ్సిడీపైన పెద్ద పడవలు కూడా ఇస్తామంటున్నారు. హార్బర్‌తో మా ఊరు బంగారంగా మారుతుంది. మా బిడ్డల, బిడ్డల భవిష్యత్ తరాల తలరాత మారనుంది.
– మామిడి గోవిందుస్వామి, మత్స్యకారుడు, జువ్వలదిన్నె, బోగోలు మండలం

మత్స్యకారులను పట్టించుకుంది జగనన్నే



మత్స్యకారులను, తీరప్రాంత గ్రామాలను ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మా బతుకులు మారాయి. వేట నిషేధ పరిహారం పెంచడం దగ్గర నుంచి హార్బర్‌లు, సబ్సిడీపై పెద్ద పడవల వరకు అన్నీ ఆయన దయతోనే జరిగాయి. ఎన్నికలప్పుడు తప్ప మమ్మల్ని పట్టించుకున్న ప్రభుత్వాలు ఇప్పటి వరకు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే మా గురించి నిజాయితీగా ఆలోచించి ఇంత చేసింది.
– కొమారిరాజు, మత్స్యకారుడు, తుమ్మలపెంట, కావలి మండలం

ఒక్క అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు (ఉదయగిరి): మేకపాటి కుటుంబం నలభై ఏళ్ల నుంచి ఉదయగిరి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ఈ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశమివ్వాలని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని కాటేపల్లి, తమిదపాడు, మాధవరం, వన్నూరుపాళెం, బీసీ కాలనీల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు రాజగోపాల్‌రెడ్డికి పూల వర్షం కురిపించి, హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో విద్యాపరంగా మంచి అవకాశాలు కల్పించేందుకు డిగ్రీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలతో వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు తమ సొంత నిధులు వెచ్చించామన్నారు. నవోదయ పాఠశాల ఏర్పాటుకు అప్పట్లోనే రూ.లక్షల విలువ చేసే భూమిని ఉచితంగా ఇచ్చామన్నారు. ఉదయగిరిలో రూ.250 కోట్లు విలువ చేసే ఇంజినీరింగ్ కళాశాల ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చి వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. ఉదయగిరి ప్రాంతానికి వెలుగొండ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీలు ఇస్తుందే తప్ప అవి నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు ఓటేస్తే అది ఉదయగిరి అభివృద్ధికి విఘాతంగా మారుతుందన్నారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు జడ్పీటీసీ బాలకృష్ణారెడ్డి, స్థానిక నేతలు పల్లాల కొండారెడ్డి, గణపం రమేష్‌రెడ్డి, చిన్నికృష్ణారెడ్డి, ఎం.గోవిందరెడ్డి, బండి కృష్ణారెడ్డి, హజరత్ రెడ్డి, రాంప్రసాద్, బోగిరెడ్డి చంద్రారెడ్డి, మునసబు కొండారెడ్డి, చాకలికొండ ఎంపీటీసీ డేగా వంశీ,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిమానానికి కృతజ్ఞతలు

దుత్తలూరు: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన నామినేషన్‌కు వచ్చిన ప్రజలకు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం దుత్తలూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేకపాటి కుటుంబానికి ప్రజలకు అభిమానం వెలకట్టలేనిదన్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త, అభిమానులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సైనికులు మే 13న ఎన్నికలు అయ్యే వరకు అవిశ్రాంతిగా, సైనికుల్లా కష్టపడి వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడంతో పాటు మోసం చేయడానికి వస్తున్న టీడీపీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు, సీతారామపురం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, రంగయ్యనాయుడు, మాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు



కాటంరెడ్డి సమక్షంలో ఉలవపాళ్ల టీడీపీ నాయకులు..



సుకుమార్ రెడ్డి సమక్షంలో నార్త్ ఆములూరు టీడీపీ వార్డు మెంబర్



ఎమ్మెల్యే సమక్షంలో అన్నగారిపాళెం టీడీపీ నాయకులు..

అల్లూరు: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో గురువారం దగదర్తి మండలం ఉలవపాళ్లకు చెందిన 20 మంది టీడీపీ నాయకుల, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నేతలు యారంశెట్టి మల్లికార్జున, కుదుముల వెంకటేశ్వర్లు, బాబు, ఉలవపాళ్ల తీన్మార్ బ్యాండ్ యువకులు ఉన్నారు.


అన్నగారిపాళెం టీడీపీ కార్యకర్తలు 30 మంది..

మండలం పురిణిలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో కావలి మండలం అన్నగారిపాళెం గ్రామానికి చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ చెందిన పులి వెంకయ్య, జమ్ము బాలయ్య, వేందేటి శ్రీనయ్య, చిన్నపోయిన ప్రభాకర్, పులి కృష్ణయ్య, తిరపతి, శ్రీనివాసులు, వెంకట్రావు, రాము తదితరులు ఉన్నారు.

నార్త్‌ఆములూరు వార్డు నుంచి..

మండలంలోని నార్త్ ఆములూరు రెండో వార్డు మెంబర్ పులి సుశీలమ్మ, ఆమె కుటుంబ సభ్యులు పులి సుధాకర్, పులి వెంకటేష్‌యాదవ్ కందుకూరు అసెంబ్లీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాయకులు సామంతుల సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కరుడుగట్టిన టీడీపీ అభిమానులైన వీరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరడం విశేషం.

35వ వార్డులో టీడీపీ ఖాళీ



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 35వ వార్డులో టీడీపీ పూర్తిగా ఖాళీ అయిపోయింది. ఆ వార్డులో టీడీపీలో క్రియాశీలకంగా ఉండే నేతల నుంచి పోలింగ్ ఏజెంట్లు వరకు కేడర్ మొత్తం 50 కుటుంబాలు గురువారం ఆ పార్టీకి గుడ్ బై చెప్పాయి. 35వ వార్డు టీడీపీ నాయకులైన మద్దు వెంకట రమణయ్య, పంది వెంకటేశ్వర్లుతో పాటు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ వార్డు మాజీ కౌన్సిలర్ ఏగూరి చిన్న పుల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలబోతున్న గొప్ప విజయంలో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామన్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం



స్వామి వారి కల్యాణం



వైభవంగా రథోత్సవం

వింజమూరు(ఉదయగిరి): శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆశీనులను చేసి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం నిర్విఘ్నంగా జరగాలని కోరుకుంటూ గుమ్మడికాయలు దిష్టి తీశారు. రథాన్ని లాగేందుకు యువకులు పోటీ పడ్డారు. మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం యర్రబల్లిపాళెం నుంచి కోమటిబజారు వరకు లాగారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు దారి పొడవునా అశేష సంఖ్యలో బారులు తీరారు. ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో భక్తుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ఇతర శీతల పానీయాలు, మంచినీరు, అల్పాహారం అడుగడుగునా భక్తులకు అందించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో సీఐ ఫిరోజ్, ఎస్సై కోటిరెడ్డితో పాటు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, గణపం వెంకటరమణారెడ్డి, ఈఓ మల్లికార్జున్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు.

కనులపండువగా కల్యాణం

బుధవారం వేకువజామున శ్రీదేవి భూదేవి శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న మండపంలో కనుల పండుగగా జరిగింది. బుధవారం రాత్రి స్వామి వారిని గజవాహనంపై ఊరేగిస్తూ రాత్రి రెండు గంటలకు కల్యాణమండపం చేరుకున్నారు. పండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో స్వామివారికి కల్యాణం నిర్వహించారు.

రమణీయం.. రథోత్సవం

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో కొలువైన వేణుగోపాలస్వామి రథోత్సవం గురువారం అత్యంత రమణీయంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితరాలను వేదపండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం గజవాహనంపై స్వామి వారిని ఉంచి గ్రామోత్సవం చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తిని రథంలో ప్రతిష్ఠించి అశేష భక్తజనుల మధ్య రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

నామినేషన్ల ఘట్టం సమాప్తం

- మొత్తం 34 మంది 41 సెట్లు దాఖలు
- చివరి రోజు 18 మంది 21 సెట్ల నామినేషన్లు

ఉదయగిరి: ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టం నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభమై.. గురువారంతో ముగిసింది. చివరి రోజు గురువారం 18 మంది 21 సెట్ల నామినేషన్ పత్రాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ప్రధాన పార్టీలతో పాటు వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 34 మంది అభ్యర్థులు.. 41 సెట్ల నామినేషనపత్రాలు సమర్పించారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, డమ్మీ అభ్యర్థిగా మేకపాటి అభినవ్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా కాకర్ల సురేష్‌బాబు, కాంగ్రెస్ నుంచి సోము అనిల్‌కుమార్‌రెడ్డి, డి.రమేష్, బీఎస్పీ నుంచి కాకుటూరు పుష్పాంజలి నామినేషన్లు దాఖలు చేశారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామ సర్పంచ్ కారుదుంపల లక్ష్మీదేవి గురువారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట నాయకులు వినయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థిని ప్రతిభ



రితిక చౌదరి

చేజర్ల: జేఈఈ మెయిన్స్ ఫలితాలు గురువారం విడుదలైన నేపథ్యంలో చేజర్ల మండలం కాకివాయి గ్రామానికి చెందిన మాదాల రితిక చౌదరి 99.95 పర్సంటైల్ పొంది ఆలిండియా 789వ ర్యాంక్ సాధించింది. కాకివాయి గ్రామానికి చెందిన రవిబాబు – తనూజ దంపతుల కుమార్తె రితిక చౌదరి. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. రితిక చౌదరి ఆలిండియా ర్యాంక్ సాధించిన నేపథ్యంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించే పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఆ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించే పాలిసెట్ పరీక్షను రాసేందుకు విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. వివరాలకు 7901620305 మొబైల్ నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఆత్మకూరులోని రెండు పరీక్ష కేంద్రాల్లో 473 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలు చేయండి సారూ..



ఎన్టీఆర్ విగ్రహం కింద శిలాఫలకానికి మూత వేయని దృశ్యం

సోమశిల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనంతసాగరం నుంచి బద్వేల్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో గొరవరం గ్రామ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు ఆ విగ్రహం కింద ఉన్న శిలాఫలకం మూయకుండానే వదిలేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నెల రోజులవుతున్నా అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అలాగే మంచాలపల్లి వద్ద మెయిన్ రోడ్డుపై, ముస్తాపురం సెంటర్‌లో, చిలకలమర్రిలో శిలాఫలకాలపై మూతవేయకపోవడం గమనార్హం.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సీతారత్నం

మర్రిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మర్రిపాడు మండలంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద తహసీల్దార్ సీతారత్నం నేతృత్వంలో గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, నగదు, మద్యం అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు.

రిటర్నింగ్ అధికారి తనిఖీలు

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడు హైవే వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఆత్మకూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మధులత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, నగదు, మద్యం అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ నరసింహారావు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

ఆత్మకూరు: ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆత్మకూరులోని డీఎస్పీ, సీఐ కార్యాలయాలను ఎస్పీ తనిఖీ చేశారు. ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలతో డీఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వివాదాస్పద పోలింగ్ కేంద్రాల పరిధిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి దిశానిర్దేశం చేశారు. బైండోవర్ చేసిన వారి వివరాలు, మండల పరిధిలోని చెక్‌పోస్టులు, అక్కడి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి పట్టుబడిన నగలు, నగదు వివరాలపై ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా రూట్‌మార్చ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా గానీ, టోల్‌ఫ్రీ నంబర్ 112 ద్వారా కాల్ చేసి వివరాలు తెలుపవచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి, సీఐలు జి.వేణు, రవినాయక్, ఎస్సై ముత్యాలరావుతోపాటు పలు పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో గురువారం చేజర్ల మండలం బోడిపాడు గ్రామంలోని కొండారెడ్డి నివాసంలో చేజర్ల కంద్రికకు చెందిన టీడీపీ నాయకులు బొగ్గల వెంకటరెడ్డి, బొగ్గల రమణారెడ్డి, బొగ్గల వసంతమ్మ, గెజ్జల ఓబులమ్మతోపాటు అరుంధతీయవాడకు చెందిన మందా ఆదాము, జి.ఆంజనేయులు, పెంచలయ్య వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: ఆత్మకూరులో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించే కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణం కనులపండువగా జరిగింది. సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి వేదికపై కొలువు దీర్చారు. అర్చకులు సీతారాముల కల్యాణ ఘట్టాలను వివరిస్తూ కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అనంతరం గజ వాహనంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు సీతారాములకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డీసీపల్లిలో 387 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం 387 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 583 బేళ్లు రాగా వాటిలో 387 విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 49,456 కిలోల పొగాకును విక్రయించామని, రూ.1,21,93,042 వ్యాపారం జరిగిందని తెలిపారు. కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 కాగా కనిష్ట ధర రూ.218 లభించింది. మొత్తమ్మీద సగటు ధర రూ.246.54గా నమోదైంది. వేలంలో 13 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం



సోమశిల: అనంతసాగరంలో సర్పంచ్ శోభ, నాయకుడు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్లపల్లి శ్రీను, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పతివ్రతమ్మతల్లికి గ్రామోత్సవం



అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో జీర్ణోద్ధరణ చేసిన శ్రీపతివ్రతమ్మతల్లి దేవాలయం ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి మూలమూర్తికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి గణపతి పూజ, వేదపారాయణం, ధాన్యాధివాసం, హారతి తదితర పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మంగళ హారతులతో నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



ప్రమాదానికి కారణమైన లారీ

మర్రిపాడు: మండలంలోని కండ్రిక సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై కండ్రిక వద్ద బుధవారం అర్ధరాత్రి ఆగి ఉన్న శనక్కాయల లోడు లారీని వెనుక నుంచి వస్తున్న స్పిరిట్ లారీ ఢీకొట్టడంతో శనక్కాయల లోడు లారీ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో స్పిరిట్ లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విక్రమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

అనుమసముద్రంపేట: వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం ఏఎస్‌పేట మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు కొండమీదకొండూరు, 10 గంటలకు తెల్లపాడు, 11 గంటలకు అనుమసముద్రం, సాయంత్రం 4 గంటలకు వెల్పులగుంట, 5 గంటలకు కావలియడవల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని మండల నాయకులు కోరారు.

నామినేషన్ల ఘట్టం ముగింపు

ఆత్మకూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 27 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి రోజు అని, ఆఖరు రోజున 6 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా చెరుకూరు రంతు, విశ్వజన పార్టీ అభ్యర్థిగా బెల్లంకొండ వెంకటేష్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా నాగసాయి రామనారాయణరెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా దాని రామనారాయణరెడ్డి (3వ సెట్), కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, మరో ఇండిపెండెంట్ అభ్యర్థి నాగెళ్ల వెంకటభానుప్రకాష్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్‌ఓ తెలిపారు. కాగా మొత్తం 15 మంది అభ్యర్థులు 27 నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. స్క్రూటినీ శుక్రవారం నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ చివరి తేదీ అన్నారు.

మర్రిపాడులో ప్రచారం



సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు, జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, సీపీఎం ప్రచారం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్, సీపీఎం ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఖాజారంతుల్లా, ప్రజానాట్యమండలి ఇన్‌చార్జి గద్దర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బార్ సీజ్

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీలోని బార్‌ను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. బార్‌లో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించి సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమలేశ్వర్‌రెడ్డి, సెబ్ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు తెలిపారు.

బీసీల సమావేశాన్ని జయప్రదం చేయండి

- డాక్టర్ ఆదిశేషయ్య



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిశేషయ్య తదితరులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు జరిగే ఆత్మకూరు నియోజకవర్గ బీసీల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య కోరారు. గురువారం ఆత్మకూరులోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులను నియమించారని తెలిపారు. 2019లో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌కు మంత్రి పదవి కేటాయించారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని గెలిపించుకుంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సంగం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, బీసీ సంఘం యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు 99 శాతం అమలు



నల్లపరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారని జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. మండలంలోని నల్లపరెడ్డిపల్లిలో గురువారం వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిలకు మద్దతుగా స్థానిక నాయకులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రతి ఒక్కరూ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు వాసిపల్లి లక్ష్మీరెడ్డి, సర్పంచ్‌లు దొడ్ల వెంకురెడ్డి, శ్రీదేవమ్మ, బొలిగర్ల వెంకటేశ్వర్లు, సతీష్‌నాయుడు, నాయకులు ఏడెం పెంచలరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దామోదర్‌రెడ్డి, శివారెడ్డి, బాబుల్‌రెడ్డి, రమేష్‌నాయుడు, మహిళా నాయకురాలు ఆయేషా, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో ఉద్రిక్తత

- టీడీపీ, కాంగ్రెస్ పోటాపోటీ ప్రచారం



టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం

అనుమసముద్రంపేట: మండల కేంద్రం ఏఎస్‌పేటలో ఒక వైపు టీడీపీ, మరోవైపు కాంగ్రెస్ పార్టీ పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఏఎస్‌పేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రజానాట్యమండలి కళాకారులతో ప్రచారం నిర్వహిస్తుండగా.. తెలుగుదేశం పార్టీ నాయకులు వచ్చి అక్కడి నుంచి మీ వాహనాన్ని తొలగించి దూరంగా వెళ్లాలని హుకూం జారీ చేయడంతో కాంగ్రెస్ నాయకులు ధీటుగా సమాధానమిచ్చారు. మొదటి నుంచి మేము ఇక్కడే ఉన్నాం, మా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వస్తున్నారు, మీరే ఇక్కడి నుండి వెళ్లండి అంటూ సమాధానం చెప్పడంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఇరుపార్టీల ప్రచార రథాలు ఎదురవడంతో ప్రధాన రహదారిపై కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం స్థానిక నాయకుల చొరవతో గొడవ సద్దుమణగడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు మార్జిన్‌లోకి దిగిన బస్సు

సీతారామపురం: సీతారామపురం–సంగసానిపల్లి మార్గంలో జగనన్న కాలనీల వద్ద గురువారం ఉదయగిరి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. సీతారామపురం నుంచి ఉదయగిరికి బయల్దేరిన ఆర్టీసీ బస్సు ముందుగా వెళుతున్న ఆటోను జగనన్న కాలనీ వద్ద క్రాస్ చేయబోయి అదుపు తప్పి పక్కకు ఒరిగింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కనులపండువగా రథోత్సవాలు



మూలాపేటలో వేణుగోపాలస్వామి రథోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. భక్తులు విశేషంగా పాల్గొని దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలుగా నూకల సీతమ్మ వీలునామా ప్రకారం పేటేటి రాఘవరావు దంపతులు వ్యవహరించారు. రాత్రి పుష్పక విమానంలో వేణుగోపాలుడు భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా సాగిరాజు వెంకటరాజు, సునీత దంపతులు వ్యవహరించారు.

- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం పప్పులవీధిలోని వినాయకస్వామి మందిరం వరకు వెళ్లి తిరిగి దేవస్థానం చేరుకుంది. భక్తులు విశేషంగా పాల్గొని ఆదిదంపతులను దర్శించుకున్నారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో కోదండరామస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతాలక్ష్మణహనుమత్ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం శ్రీరంగరాజపురం, రేబాలవారి వీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు మీదుగా తడికలబజారుసెంటర్‌కు, అక్కడి నుంచి తిరిగి దేవస్థానం చేరుకుంది. రాత్రి తిరుచ్చి ఉత్సవం జరిపారు.

నేత్రపర్వం.. రథోత్సవం



వింజమూరు(ఉదయగిరి): శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఆశీనులను చేసి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం నిర్విఘ్నంగా జరగాలని కోరుకుంటూ గుమ్మడికాయలు దిష్టి తీశారు. రథాన్ని లాగేందుకు యువకులు పోటీ పడ్డారు. మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం యర్రబల్లిపాళెం నుంచి కోమటిబజారు వరకు లాగారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు దారి పొడవునా అశేష సంఖ్యలో బారులు తీరారు. ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో భక్తుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ఇతర శీతల పానీయాలు, మంచినీరు, అల్పాహారం అడుగడుగునా భక్తులకు అందించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో సీఐ ఫిరోజ్, ఎస్సై కోటిరెడ్డితో పాటు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, గణపం వెంకటరమణారెడ్డి, ఈఓ మల్లికార్జున్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు.

కనులపండువగా కల్యాణం

బుధవారం వేకువజామున శ్రీదేవి భూదేవి శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న మండపంలో కనుల పండుగగా జరిగింది. బుధవారం రాత్రి స్వామి వారిని గజవాహనంపై ఊరేగిస్తూ రాత్రి రెండు గంటలకు కల్యాణమండపం చేరుకున్నారు. పండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో స్వామివారికి కల్యాణం నిర్వహించారు.



రమణీయం.. రథోత్సవం

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో కొలువైన వేణుగోపాలస్వామి రథోత్సవం గురువారం అత్యంత రమణీయంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితరాలను వేదపండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై స్వామి వారిని ఉంచి గ్రామోత్సవం చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తిని రథంలో ప్రతిష్ఠించి అశేష భక్తజనుల మధ్య రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.